సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 6 । మార్చి । 2025



సోమశిలలో 57.640 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 57.640 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3150 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.89,010
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,065
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,307
సవర (8 గ్రాములు)	రూ.66,456

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.1 /24.8


జిల్లాలో గురువారం పగలు వేడి వాతావరణం ఉంటుందని ఆ శాఖాధికారులు తెలిపారు. బుధవారం గాలిలో తేమ 57 శాతంగా నమోదైంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురువారం	శుక్రవారం
సా: 6.19	ఉ: 5.03

ఆగని దందా..
తీరని ఆకలి మంట

పేదల ఆకలి తీర్చే రేషన్ బియ్యంతో అధికార పార్టీ నేతలు జేబులు నింపుకుంటున్నారు. మార్కెట్లో బియ్యం కొనే ఆర్థిక స్థోమత లేక.. రేషన్ బియ్యం అందక పేదలు ఆకలి మంటలతో అల్లల్లాడుతున్నారు. జిల్లాలో గడిచిన మూడు నెలలుగా రేషన్ షాపులకు చేరాల్సిన నెలవారీ బియ్యం కోటా తగ్గిపోయింది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి షాపులకు వెళ్లాల్సిన బియ్యం నేరుగా రైసు మిల్లులకు చేరుతోంది. అక్కడి నుంచి దొడ్డిదారిన విదేశాలకు తరలిపోతోంది. ప్రధానంగా కందుకూరు నియోజకవర్గంలో ప్రతి రేషన్ షాపును అధికార పార్టీ ముఖ్య నేతలు తన గుప్పెట్లో పెట్టుకుని గుప్పెడు బియ్యం కూడా పేదలకు చేరకుండా అక్రమ రవాణా దందాకు పాల్పడుతున్నట్లు సమాచారం. పోలీసులు, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు రేషన్ మాఫియా ముఠాకు సహకారం అందిస్తున్నారు.



పెదపవని గ్రామంలోని ఓ రైస్ మిల్లులో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం బస్తాలు

- పేదల బియ్యంతో పెద్దల వ్యాపారం
- కందుకూరు అడ్డాగా చెలరేగిపోతున్న మాఫియా
- పెదపవని రైస్‌మిల్లు కేంద్రంగా అక్రమ రవాణా
- ఒంగోలు వ్యాపారులకే అమ్మేలా నిర్ణయం
- నియోజకవర్గ ముఖ్య నేతకు నెలకు రూ.22 లక్షలు
- మూడు నెలలుగా రేషన్ షాపులకు తగ్గిన సరఫరా 'కోటా'
- పేదల ఇంట ఆకలి కేకలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కందుకూరు నియోజకవర్గంలో రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. పేద ప్రజలకు కడుపు నింపాల్సిన రేషన్ బియ్యాన్ని టీడీపీ నేతలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. 80 శాతం బియ్యం నేరుగా ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రైస్‌మిల్లులకు తరలిస్తుండగా, మిగతా 20 శాతం బియ్యం పేదలకు పంపిణీ చేసినట్లు రేషన్ షాపుల దగ్గరే బలవంతంగా కొనుగోలు చేస్తున్నారు. రేషన్ షాపుల వద్ద బియ్యం కొనుగోలు చేయడానికి మండలానికొక ఏజెంట్లను నియమించుకున్నారు. బయట మార్కెట్లో కేజీ బియ్యం రూ.63 పలుకుతోంది. రేషన్ బియ్యం వస్తున్నా.. తీసుకెళ్లి తినేందుకు కూడా వీలులేకుండా టీడీపీ నేతలు కేజీకి రూ.10 చేతిలో పెట్టి తన్నుకుపోతున్నారు. దీంతో పేదలు తిండి లేక ఆకలితో అలమటిస్తున్నారు.

నెలకు 1100 మెట్రిక్ టన్నులు విదేశాలకు..

నియోజకవర్గంలో కందుకూరు మున్సిపాలిటీ నుంచి కందుకూరు రూరల్, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, వలేటివారిపాలెం మండలాల్లో కలిపి మొత్తం 174 రేషన్ షాపులు ఉన్నాయి. ఆ షాపులకు నెలకు 1100 మెట్రిక్ టన్నుల బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సరఫరా చేయాల్సి ఉంది. ఇందులో కేవలం 200 నుంచి 250 మెట్రిక్ టన్నులు మాత్రమే ప్రజలందరికీ కనిపించేలా లబ్ధిదారులకు సరఫరా చేస్తున్నారు. ఆ పక్కనే ఉండే ఏజెంట్లు (వీరు టీడీపీ నేతలు ఏర్పాటు చేసుకున్న క్యారియర్లు) కార్డుదారుల నుంచి బలవంతంగా కొనుగోలు చేస్తారు. కార్డుదారులకు బియ్యం ఇవ్వడం, లేదంటే బియ్యం బదులుగా నగదు ఇచ్చేసి డీలర్లు కొనుగోలు చేసి వాటిని ఆ మండల ఏజెంట్లకు అప్పగిస్తారు. ఈ లెక్కన ఏ కార్డుదారుడి ఇంటికి గుప్పెడు రేషన్ బియ్యం చేరే పరిస్థితి లేదు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి, కార్డుదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని లింగసముద్రం మండలం పెదపవనిమిల్లు లోని ఓ రైస్‌మిల్లుకు తరలిస్తారు. అక్కడ పాలిష్ పట్టించి, బ్రాండెడ్ బ్యాగుల్లో ప్యాక్ చేసి లారీల ద్వారా కృష్ణపట్నం పోర్టు, చెన్నై నుంచి విదేశాలకు తరలివెళ్తున్నాయి.

సబ్ కలెక్టర్ తనిఖీలో అక్రమాలు

కందుకూరు: కందుకూరులో రేషన్ మాఫియా ఏ స్థాయిలో చేలరేగిపోతుందో సబ్ కలెక్టర్ బుధవారం చేపట్టిన తనిఖీల్లో బట్టబయలు అయింది. పట్టణంలోని ఉప్పుచెరువు రోడ్డులో ఉన్న ఓ రేషన్ షాపులో బియ్యాన్ని లబ్ధిదారులకు ఇవ్వకుండా రెండు రోజుల క్రితమే పూర్తిగా బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు సబ్ కలెక్టర్ తిరుమాణి శ్రీపూజకు సమాచారం అందింది. దీంతో ఆమె బుధవారం మధ్యాహ్నం తన సిబ్బందితో కలిసి రేషన్ షాపు తనిఖీకి వెళ్లారు. అయితే సబ్ కలెక్టర్ తనిఖీకి వస్తున్న సమాచారాన్ని ముందుగానే తెలుసుకున్న రేషన్‌షాపు డీలర్ షాపునకు తాళాలు వేసి అక్కడి నుంచి పరారయ్యాడు. దాదాపు ఓ అర గంట పాటు షాపు వద్ద వేచి ఉన్న సబ్ కలెక్టర్ ఎట్టకేలకు డీలర్‌కు ఫోన్ చేయగా తాము ఇక్కడ లేమని, ఒంట్లో బాగోలేక హాస్పిటల్‌కు వెళ్లినట్లు సమాచారం ఇచ్చారు. దీంతో సబ్ కలెక్టర్ రేషన్ షాపు వద్ద ఓ వీఆర్ఏని కాపలా ఉంచి తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు తాళాలు తీయొద్దని ఆదేశాలిచ్చి వెళ్లిపోయారు.

సబ్ కలెక్టర్ వెళ్లగానే.. ఆదేశాలు ధిక్కరించి..

సబ్ కలెక్టర్ అలా వెళ్లడమే ఆలస్యం.. షాపులో సరుకు సరి చేసేందుకు మొత్తం రేషన్ మాఫియా క్షణాల్లో రంగంలోకి దిగింది. పట్టణంలోని మరో షాపు నుంచి రేషన్ బియ్యం బస్తాలను ఎండీయూ వాహనం ద్వారా తరలించారు. గంట వ్యవధిలో మరో షాపు నుంచి బియ్యం బస్తాలు తెచ్చి ఈ షాపులో ఉంచారు. స్వయంగా సబ్ కలెక్టర్ వచ్చి తనిఖీ చేసి తాళాలు తీయొద్దని ఆదేశాలిచ్చి వెళ్లినా కింది స్థాయి అధికారులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా రేషన్ మాఫియాకు యథేచ్ఛగా సహకరించారు. సబ్ కలెక్టర్ లంచ్‌కు బంగ్లాకు వెళ్లిన సమయంలో రేషన్ మాఫియా ఈ తతంగాన్ని పూర్తి చేసింది.

సగం షాపులు ఖాళీ

వాస్తవానికి రేషన్ షాపుల ద్వారా ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు బియ్యంతోపాటు ఇతర సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే రేషన్‌షాపుల మొత్తాన్ని తమ గుప్పెట్లో పెట్టుకున్న అధికార పార్టీకి చెందిన కీలక నేతలు చెప్పినట్లు డీలర్లు వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి పంపిణీ ప్రారంభం కాకముందే నేరుగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఆ తర్వాత నిదానంగా లబ్ధిదారులకు బియ్యం లేవని చెప్పి, డబ్బులిచ్చి వేలిముద్రలు వేయించుకున్నారు. ఈ నెల 5వ తేదీ నాటికే కందుకూరు పట్టణంలో దాదాపు సగం షాపుల్లో ఇప్పటికే బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు సమాచారం. ఏ షాపుల్లోనూ బియ్యం నిల్వలు లేవు. ఈ విధమైన సమాచారం రావడంతోనే బుధవారం సబ్ కలెక్టర్ ఓ రేషన్‌షాపు తనిఖీకి వెళ్లారు. అయితే, ఇక్కడ కూడా దొరకకుండా సబ్‌కలెక్టర్‌ను సైతం రేషన్ మాఫియా బోల్తా కొట్టించింది. సబ్‌కలెక్టర్ కళ్లుగప్పి మరీ లేని బియ్యాన్ని ఉన్నట్లు చూయించేందుకు నానా హైరానా పడ్డారు. ఈ వ్యవహారంలో సివిల్ సప్లయిస్ శాఖలో పనిచేసే ఓ అధికారి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా తనిఖీలకు వస్తుంటే ముందుగా రేషన్ మాఫియాకు సమాచారం ఇవ్వడం, వారిని అలర్ట్ చేసే పనిలో ఈ అధికారి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అధికార యంత్రాంగం ప్రస్తుతం పట్టణంలోని రేషన్ షాపులన్నీ తనిఖీ నిర్వహిస్తే వీరి బండారం మొత్తం ఒక్క సారిగా బయటపడుతుంది.

బియ్యం సేకరణ ఇలా..

కందుకూరు నియోజకవర్గంలో బడా నేత ఆధ్వర్యంలో మండలాలనికి ఇద్దరు టీడీపీ నాయకులను ఈ వ్యాపారానికి కేటాయించారు. డీలర్లు ప్రజల నుంచి కేజీ బియ్యం రూ.10 కొనుగోలు చేస్తారు. ఇది కేవలం 25 శాతం మాత్రమే. 75 శాతం ప్రజల వరకు రాకుండానే నేరుగా తరలుతుంది. ఈ బియ్యాన్ని డీలర్లు రూ.16లకు మండలంలోని ఆ టీడీపీ నేతకు అమ్ముతారు. ఆయన రూ.19లకు రైస్ మిల్లుకు చేర్చుతారు. అక్కడ పాలిష్ పట్టించి.. రూ.39లకు ఒంగోలుకు చెందిన ఓ టీడీపీ నేతకు విక్రయిస్తారు. సదరు నేత నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతకు నెలకు రూ. 26 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఒంగోలుకు చెందిన వ్యాపారి తప్ప ఇంకెవరూ ఈ నియోజకవర్గంలో వ్యాపారం చేయడానికి లేదని ఆదేశాలు వెళ్లాయి. ఎవరైనా చిరు వ్యాపారి రేషన్ బియ్యం కొనుగోలు చేశాడంటే పోలీసు కేసులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ విధంగా నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేత ఇటు డీలర్లు, మండల స్థాయి ఏజెంట్ల నుంచి కూడా కమీషన్లు దండుకుంటున్నట్లు సమాచారం.

అధికారుల సహకారంతోనే..

ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి బియ్యం అక్రమ వ్యాపారం మొత్తం అధికారుల పూర్తి సహకారం అండతోనే జరుగుతోంది. రెవెన్యూ, పోలీస్ శాఖ తమ శాయశక్తులా ఈ వ్యాపారానికి అండగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నేతకు తెలియకుండా ఎవరైనా వ్యాపారం చేస్తే వారిని పిలిచి వార్నింగ్‌లు ఇచ్చే స్థితికి పోలీస్ శాఖ వెళ్లిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇటీవల ఓ చిరు వ్యాపారిని నీ సంగతి తేలుస్తా అంటూ ఉలవపాడు పోలీస్ అధికారి బెదిరించినట్లు సమాచారం. తాజాగా బుధవారం కూడా మరోసారి బడా నేతకు తెలియకుండా చేస్తే వెంటనే అధికారులు వచ్చి పట్టుకుని కేసు నమోదు చేస్తారంటూ బెదిరించినట్లు తెలిసింది.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు 75 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు బుధవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 75 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగానికి సంబంధించి 23,310 మంది విద్యార్థులకు 22,877 మంది హాజరయ్యారు. 433 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 986 మందికి 944 మంది హాజరు కాగా 42 మంది గైర్హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు, డీవీఈఓ 5, డీఈసీ 4, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు 24 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షకు 279 మంది..

ఏపీ ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు బుధవారం మొత్తం 279 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో 20 సెంటర్లలో జరిగిన పరీక్షకు 3,056 మంది విద్యార్థులకు 2,777 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు 4 సెంటర్లను తనిఖీ చేశారు.

పులుల గణన ప్రారంభం

- ఫారెస్ట్ రేంజర్ శేఖర్

ఆత్మకూరు: ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలో పులుల గణన ప్రారంభించనున్నట్లు రేంజ్ అధికారి శేఖర్ బుధవారం తెలిపారు. ఇప్పటికే అటవీ ప్రాంతంలో ట్రీ, ట్రాప్ కెమెరాలు కొన్ని ఏర్పాటు చేశామని, అయితే పులుల గణనకు అవి సరిపోవన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా ఆదేశాలతో శ్రీశైలం ప్రాంతం నుంచి మరిన్ని కెమెరాలు తీసుకురానున్నట్లు తెలిపారు. ఇప్పటికే అడవిలో పులులు సంచరించే ముఖ్య ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేసి పులుల సంఖ్యను లెక్కించనున్నామన్నారు. ఈ ప్రక్రియ నెల రోజులకుపైగా పట్టే అవకాశం ఉందని తెలిపారు. పులుల సంరక్షణ కోసం అడవిలో పలు ప్రాంతాల్లో సిమెంట్ తొట్టెల ద్వారా తాగునీటి ఏర్పాట్లు చేశామన్నారు. ఎప్పటికప్పుడు వాటిలో క్షేత్ర స్థాయి సిబ్బంది నీరు నింపుతున్నట్లు తెలిపారు. అటవీ సమీప గ్రామాల్లో నివశిస్తున్న వారు జంతువుల సంరక్షణకు ఎలాంటి విఘాతం కలిగించరాదన్నారు. ఆయన వెంట డీఆర్ఓ పిచ్చిరెడ్డి ఉన్నారు.

రేపు టౌన్ ప్లానింగ్ సిబ్బందికి శిక్షణ

నెల్లూరు (బారకాసు): గుంటూరు ప్రాంతీయ సంచాలకుల పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 7న నెల్లూరు నగర పాలక సంస్థతోపాటు కావలి, ఆత్మకూరు మున్సిపాలిటీలు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు నగర పంచాయతీల పరిధిలోని పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది, వార్డు సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు, ఎల్‌టీపీలకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు పట్టణ ప్రణాళిక విభాగం సిటి ప్లానర్ పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఉదయం 10 గంటలకు జరగనున్న శిక్షణలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ విభాగంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్దేశించిన వివిధ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు కల్పించనున్నారని తెలిపారు. ఈ సమావేశానికి లైసెన్స్‌డ్ సివిల్ ఇంజినీర్లు, బిల్డర్లు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ, మున్సిపల్, నగర పంచాయతీల కమిషనర్లు తమ పరిధిలోని పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించిన సిబ్బంది శిక్షణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ సస్పెన్షన్

- మరో నలుగురికి షోకాజ్ నోటీసులు

నెల్లూరు(అర్బన్): అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో జిల్లాలోని హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ మధుసూదన్‌రావును సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఎండీ రాజాబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో హౌసింగ్ కార్పొరేషన్ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేసిన నాగరాజుతోపాటు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దయాకర్, ఏఈలు జమీర్, వెంకటేశ్వర్లుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గతంలో హౌసింగ్ కార్పొరేషన్‌లో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. సిమెంట్, స్టీల్‌తో పాటు ఇసుకను కూడా అమ్ముకున్నట్లు రూఢీ అయింది. ఒక్క ఇసుక ద్వారానే రూ.34.45 లక్షలు అక్రమాలకు పాల్పడినట్లు విజిలెన్స్ కమిటీ ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీంతో ఆ శాఖ ఎండీ రాజాబాబు ఈ మేరకు చర్యలు చేపట్టారు. దీంతో హౌసింగ్ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి చర్చనీయాంశంగా మారింది.

దళారులను నమ్మి మోసపోవద్దు

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి
- కలెక్టర్ ఆనంద్



ధాన్యం కొనుగోలు కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

మనుబోలు: దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆనంద్ రైతులకు సూచించారు. మండలంలోని పిడూరులో నిర్వహిస్తున్న భూముల రీసర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. మనుబోలు సచివాలయం-1లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే సకాలంలో తమకు నగదు జమ చేయడం లేదని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. దీనికి స్పందించిన కలెక్టర్ రైతులు అలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. విక్రయించిన ధాన్యానికి సకాలంలో నగదు జమ చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు చేర్చేందుకు రవాణా సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. జిల్లాలోని 33 మండలాల్లో ఒక్కొక్క గ్రామంలో రీసర్వేను మోడల్‌గా నిర్వహిస్తున్నామని తెలిపారు. అది పూర్తయ్యాక లోటుపాట్లను పరిశీలించి అన్ని గ్రామాల్లో రీసర్వేను నిర్వహిస్తామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సుబ్బయ్య, రీసర్వే డీటీ మంజుల, ఆర్ఐ శ్రీకాంత్, ఏఓ షేక్ జహీర్, వీఆర్వో నాగార్జునరెడ్డి తదితరులున్నారు.

అప్పులతో రాజధాని నిర్మాణం



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు రూరల్: రాష్ట్ర రాజధానిని అప్పులతో నిర్మిస్తున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. బుధవారం వివిధ శాఖల అధికారులతో మంత్రి తిక్కన ప్రాంగణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రూ.64 వేల కోట్లతో 5 వేల ఎకరాల్లో రాజధాని నిర్మిస్తాం అని తెలిపారు. ఇప్పటికే రూ.50 వేల కోట్ల పనులకు టెండర్లు పిలిచామని చెప్పారు. రాజధాని పరిధిలో ప్రజల నుంచి వసూలు చేసే పన్నుల్లో నుంచి ఒక్క పైసా కూడా రాజధానికి ఖర్చు చేయమని తెలిపారు. 5 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించామని, రాజధాని నిర్మాణానికి హడ్కో ప్రపంచ బ్యాంక్, ఏడీబీ తదితర బ్యాంక్‌ల నుంచి అప్పు తీసుకుని నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. 1000 నుంచి 1200 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలు, పాఠశాలలు, సంస్థలకు కేటాయించామన్నారు. బడ్జెట్‌లో రాజధానికి రూ.6 వేల కోట్లు కేటాయించాం. అవసరమైతే ఇంకా నిధులు ఇస్తామని సీఎం చెప్పారన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఓ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం



మత్స్యకార కాపులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: మత్స్యకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీమంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కృష్ణపట్నం పంచాయతీలోని ఆర్కాట్‌పాళెంలో బుధవారం ఆయన పర్యటించారు. మత్స్యకార కుటుంబ పెద్దలతో మాట్లాడారు. మత్స్యకార కుటుంబాలకు ఇచ్చిన హామీలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. ప్రస్తుతం చంద్రబాబు తాను ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. 2014 ఎన్నికల్లో రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామని హామీని చంద్రబాబు ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. మత్స్యకార భరోసా కింద రూ.20 వేలకు ఇస్తానని, డీజిల్‌పై 50 శాతం సబ్సిడీ ఇస్తామని ఓట్లు దండుకుని మొండి చెయ్యి చూపారని గుర్తు చేశారు. వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రూ.4 వేల నుంచి రూ.10వేలకు పెంచి ఇస్తామని 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని గుర్తు చేశారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఈ పథకాన్ని అందించారని తెలిపారు. ప్రస్తుతం ఏ పథకాలు మత్స్యకారులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నేత అక్కయ్యగారి అంకయ్య తల్లి లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని కాకాణి పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నెల్లూరు శివప్రసాద్, స్థానిక ఉపసర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

వెంకటాచలం: ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేస్తుండగా తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. వివరాలు.. నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళ్తున్న బొలెరో వాహనంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంతో తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ వాహనాన్ని వెంబడిస్తూ వచ్చారు. వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద స్థానిక పోలీసుల సహకారంతో దుంగల్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని తీసుకెళ్లారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినని నమ్మించి..

- నెల్లూరు యువతిని వివాహం చేసుకున్న ఓ వ్యక్తి
- భర్త నిజస్వరూపం తెలిసి పోలీసులకు ఫిర్యాదు
- నిందితుడు, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఒకతను తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌నని నమ్మించి రూ.లక్షల్లో కట్న కానుకలు తీసుకుని ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజులు ఆమెకు ఎలాంటి అనుమానం రాకుండా నటించాడు. అనంతరం భార్యను చిత్రహింసలకు గురి చేయసాగాడు. ఎందుకిలా చేస్తున్నాడో అర్థం కాని భార్య.. భర్త ప్రవర్తనను నిశితంగా పరిశీలించగా అసలు విషయం తెలిసి నిర్ఘాంతపోయింది. భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాదని యువతుల బ్రోకర్ అని తేలడంతో కన్నీటి పర్యంతమైంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు మెక్లెన్స్ రోడ్డుకు చెందిన ఓ యువతికి ఆమె పెద్దలు మ్యాట్రిమోని ద్వారా వివాహ సంబంధాలు చూస్తుండగా.. విజయవాడ ప్రాంతానికి చెందిన అమీర్‌ఖాన్ పరిచయమయ్యాడు. తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాని, నెలకు రూ.80 వేలు జీతమని నమ్మించాడు. ఇరు కుటుంబాల అంగీకారంతో ఆ యువతికి 2023 సంవత్సరం ఫిబ్రవరి 26వ తేదీన అమీర్‌ఖాన్‌తో వివాహం జరిగింది. ఆ సమయంలో యువతి కుటుంబ సభ్యులు రూ.15 లక్షల నగదు, 13 సవర్ల బంగారు కట్నకానుకుల కింద ఇచ్చారు. రెండునెలలపాటు వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగింది.

ప్రవర్తనలో మార్పు

క్రమంగా అమీర్‌ఖాన్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. భార్యను చిత్రహింసలకు గురి చేయసాగాడు. గంటల తరబడి ఒంటరిగా గదిలో ఉంటూ ఆమెను పూర్తిగా పట్టించుకోవడం మానేశాడు. దీంతో అతడి ప్రవర్తనపై భార్యకు అనుమానం వచ్చింది. ఓ రోజు అతను బాత్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో ఆమె రూమ్ శుభ్రం చేస్తుండగా మంచం పక్కనే పెద్ద సంఖ్యలో సెల్‌ఫోన్లు ఉండటాన్ని గమనించింది. ఒకటి తీసుకుని అందులోని నంబర్లకు కాల్ చేసింది. అవతలి వాళ్లు చెప్పిన మాటలకు ఆమె నిర్ఘాంతపోయింది. అమీర్‌ఖాన్ అమ్మాయిల బ్రోకర్ అనే విషయం బయటపడింది. దీంతో భర్తను ప్రశ్నించగా కోపోద్రిక్తుడైన అతను ఆమెపై దాడి చేశాడు. అత్తమామలు, ఆడబిడ్డ సైతం దుర్భాషలాడారు. అదనపు కట్నం కోసం ఆమెను చిత్రహింసలు పెట్టారు. ఇటీవల ఇంట్లో నుంచి గెంటేశారు. దీంతో బాధిత మహిళ నెల్లూరులోని తల్లిదండ్రుల వద్దకు చేరుకుని బోరున విలపించింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌నని తమను నమ్మించి మోసగించిన భర్త, అత్తింటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తెలిపారు.

మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని మోడల్ స్కూల్స్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఆర్.బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 11 మోడల్ పాఠశాలలు ఉన్నాయన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20న జరుగుతుందన్నారు. 5వ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు www. cse. ap. gov. in లేదా www. apms. apcfss. in వెబ్‌సైట్‌లను సంప్రదించాలన్నారు.